సాక్షి
మెదక్
ఆదివారం । 21 । జూలై । 2024

నేడు నీటి సరఫరా బంద్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో ఆదివారం తాగు నీటి సరఫరా జరగదని మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగూరు వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నందున మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

'ప్రజారోగ్యమే ధ్యేయంగా పట్టణంలో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం.. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే, ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు పది నిమిషాల పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం' అని మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ తెలిపారు. శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా.. పట్టణంలోని ఆయా వార్డుల ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సావధానంగా విన్న కమిషనర్.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా కోతులు, కుక్కలు, పందుల బెడదపై అత్యధికంగా ప్రజలు ఫిర్యాదు చేశారు. – మెదక్ మున్సిపాలిటీ

సాక్షి ఫోన్ ఇన్


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

- దోమల నివారణకు ఫాగింగ్
- మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

➡ జంబికుంట వీధిలోని మా ఇంటి ఎదుట చెత్త వేస్తున్నారు. దుర్గంధం భరించలేకపోతున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయించండి.
– ముంజంబీల్, జంబికుంట

కమిషనర్: చెత్త వేస్తున్న వారి ఫొటో తీసి పంపిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఒకసారి వీధిలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాం. మరోసారి చేయిస్తాం.

➡ పిట్లం చెరువులో చెత్త వేస్తున్నారు. పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో దోమలు, ఈగలు పెరిగి ఇబ్బంది పడుతున్నాం.
– నరేష్, 23వ వార్డు

కమిషనర్: సిబ్బందిని పంపించి పిచ్చి మొక్కలు తొలగిస్తాం. చెరువులో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

➡ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో మురికి కాల్వ చెత్తతో నిండి పోయింది. నీరు రోడ్డుపై చేరి బురదమయంగా మారింది. కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది.
– శ్రావణ్, ఇందిరాపూరి కాలనీ

కమిషనర్: సిబ్బందిని పంపించి తక్షణ చర్యలు తీసుకుంటాం.

➡ మురికి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమలు విపరీతంగా ఉన్నాయి. నివారణ చర్యలు చేపట్టండి
– రూపేష్, కోలిగడ్డ వీధి, అబ్దుల్లా, అరబ్‌గల్లి

కమిషనర్: సిబ్బందికి చెప్పి మురికి కాల్వలు శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

➡ ఫత్తేనగర్ వీధిలోని సినీ మ్యాక్స్ థియేటర్ వద్ద గల ఖాళీ ప్రాంతంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. అలాగే ప్రధాన రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది.
– మన్సూర్ హైమద్, ఫత్తేనగర్

కమిషనర్: సిబ్బందిని పంపించి తక్షణ చర్యలు చేపడుతాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

➡ నర్సీఖేడ్ వెళ్లే ప్రధాన దారిలో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి వర్షం నీరు నిలిచింది. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదకర పరిస్థితి నెలకొంది.
– బొందుగుల నాగరాజు, అజంపురా

కమిషనర్: శానిటేషన్ సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం.

➡ వెంకట్రావునగర్ కాలనీలో గల సిద్ధార్థ స్కూల్ వద్ద చెట్లు నరికి కుప్పలుగా వేశారు.
– పరమేశ్వర్, కాలనీ వాసి

కమిషనర్: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి తొలగింప జేయిస్తాం.

➡ కూరగాయల మార్కెట్‌లో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. తక్షణ చర్యలు చేపట్టండి.
– సురేష్, వెంకట్రావునగర్ కాలనీ

కమిషనర్: పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

➡ హన్మంతరావు కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు.
– వనిత, కాలనీ వాసి

కమిషనర్: కాలనీకి ప్రత్యేక ఏర్పాట్లు లేవు. మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే మీ ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తారు.

➡ మేము రెండో అంతస్తులో ఉంటాం. చెత్త తీసుకొచ్చేలోగా మున్సిపల్ సిబ్బంది వెళ్లిపోతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా చెత్త తీసుకెళ్లడం లేదు.
– నజీం సుల్తానా, రషీద్ కాలనీ

కమిషనర్: మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తాం. మరోసారి సమస్య పునరావృతం కాకుండా చూస్తాం.

➡ మురికి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమలు, ఈగలతో ఇబ్బందులు పడుతున్నాం.
– భానుతేజ, హన్మంతరావు కాలనీ

కమిషనర్: ఇదే విషయమై కాలనీ అధ్యక్షుడితో ఇప్పటికే చర్చించాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

కుక్కలు, కోతులు, పందులతో ఇబ్బంది పడుతున్నాం

మెదక్ పట్టణంలోని అన్ని వార్డుల నుంచి అత్యధికంగా ప్రజలు కుక్కలు, కోతులు, పందులు, దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఎక్కడ చూసిన కుక్కలు, కోతుల గుంపులుగా సంచరిస్తున్నాయని తెలిపారు. మురికి కాల్వల చుట్టూ పందులు తిరుగుతున్నాయని వివరించారు. వీధుల్లో తిరగలేక పోతున్నామని, చిన్న పిల్లలు వీధుల్లోకి వెళితే తిరిగి ఇంటికి చేరుకొనే వరకు ఆందోళనకు గురికావాల్సి వస్తోందని వాపోయారు. ప్రజల సమస్యలు విన్న కమిషనర్ ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. త్వరలోనే పూర్తి కానుందని వివరించారు. పట్టణ ప్రజలకు కుక్కలు, కోతుల బెడద తీరుస్తామని హామీ ఇచ్చారు.

న్యూస్‌రీల్

మెదక్ డీఎస్పీ బదిలీ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ డీఎస్పీ రాజేష్ బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల మెదక్‌లో జరిగిన అల్లర్ల తర్వాత పోలీస్ అధికారులంతా దాదాపుగా బదిలీ అయ్యారు. ఆరు నెలల్లోనే డీఎస్పీ బదిలీ కావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బ్యాంకర్లు రైతులకు సహకరించాలి: డీఏఓ


రైతులతో మాట్లాడుతున్న డీఏఓ గోవింద్

పెద్దశంకరంపేట(మెదక్): పంట రుణాల మాఫీ విషయంలో బ్యాంకర్లు రైతులకు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, డీసీసీబీ, ఏపీజీవీబీలను సందర్శించి బ్యాంకు మేనేజర్లతో మాట్లాడారు. రుణమాఫీపై ఇబ్బందులు లేకుండా చూడాలని, మాఫీ పొందిన వారికి కొత్తగా రుణాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం మండల పరిధిలోని ముసాపేటలో రైతులతో మాట్లాడారు. అలాగే వరి, పత్తి పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై వివరించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, ఏఈఓ సుభాష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం


ఆర్.ఇటిక్యాలలో రైతుల సంబరాలు

రేగోడ్(మెదక్): రుణమాఫీ అమలుతో రెండు రోజులుగా గ్రామాల్లో రైతులు సంబురాలు చేసుకుంటున్నారు. శనివారం మండలంలోని ఆర్.ఇటిక్యాలలో ఓ పక్క వర్షం పడుతున్నా లెక్క చేయలేదు. రైతులు, కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈశ్వరప్ప, నాయకులు మల్లేశం, లక్ష్మణ్ మాట్లాడుతూ.. రైతుల రుణాలు మాఫీ చేసినందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు మెమోలు విడుదల

మెదక్ కలెక్టరేట్: ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెమోలు విడుదలైనట్లు డీఈఓ రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు డీఈఓ కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలన్నారు. హాల్‌టికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోపి శనివారం పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన తెలుగు సబ్జెక్టు బోధనకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 27 వరకే అవకాశం పేర్కొన్నారు. డిగ్రీతో పాటు బీఈడీ, టీపీటీ పూర్తి చేసి, టెట్ అర్హత కలిగిన వారు 27న డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని తెలిపారు.

రావి ఆకుపై సాయిబాబా చిత్రం


గురుపౌర్ణమిని పురస్కరించుకొని శనివారం మనోహరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మాచారి రావి ఆకుపై సాయిబాబా చిత్రాన్ని ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
– మనోహరాబాద్(తూప్రాన్)

● వర్షం.. రైతన్న హర్షం

రేగోడ్(మెదక్): జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు రైతన్నకు ఊరటనిచ్చాయి. వానాకాలం సాగుపై ఆశలు చిగురింపజేశాయి. సీజన్ ప్రారంభంలో సరైన వర్షాలు లేకపోవడంతో పంటలను రక్షించుకునేందుకు పడరాని పాట్లుపడ్డారు. ఈ దశలో తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు.. అన్నదాతలకు ఊపిరినిచ్చాయి. వానలు లేకపోవడంతో పత్తి తదితర పంటలు ఎదగకుండా ఆగిపోయాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసినా ఎదుగుదల లేని మొక్కలను చూసి ఆందోళనలో పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలు పండినట్లేనని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పత్తి మొక్కలను చూసి మురిసిపోతున్న రైతులు

మెరుగైన సేవలు అందించాలి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి నిబద్ధతో పనిచేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసులకు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పెండింగ్ ఉన్న కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో విచారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఆవశ్యకత, విజిబుల్ పోలీసింగ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అధికారులు

ఓర్వలేకే ప్రభుత్వంపై విమర్శలు: కాంగ్రెస్ నేతలు

నర్సాపూర్: రుణమాఫీ అమలుతో రైతులు సంబరాలు చేసుకుంటుంటే చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో హరీశ్‌రావుకు భూములు కాజేసిన చరిత్ర ఉందన్నారు. సునీతారెడ్డి డబ్బు సంపాదించడం దాచుకోవడం, తన భూములకు క్లియరెన్స్ పొందడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. భూములు కోల్పోయే రైతులకు సరైన నష్టపరిహారం ఇప్పిస్తామని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రైతుకు రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. ప్రొటోకాల్ కోసం పాకులాడే ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతులు చేపట్టిన రుణమాఫీ సంబరాల్లో ఎందుకు పాల్గొనలేదన్నారు. ఇటీవల శివ్వంపేటలో జరిగిన ఓ అధికారిక సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్‌ను ఎమ్మెల్యే తన పక్కన ఏ హోదాలో కూర్చోపెట్టుకున్నారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, శేషసాయిరెడ్డి, లలిత, నర్సింగ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, పక్కన రాజిరెడ్డి తదితరులు

తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి: డీఈఓ

పాపన్నపేట(మెదక్)/హవేళీఘణాపూర్: ప్రభుత్వ బడుల నిర్వహణలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరని డీఈఓ రాధాకిషన్ అన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇంటి దగ్గర చదువుకునే వాతావరణం తల్లిదండ్రులు కల్పించాలని సూచించారు. టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. ఇంటింటా చదువుల పంట యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, అభ్యాసాల సాధన చేయించాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో ఎంఈఓ నీలకంఠం, హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, నాగరాజు, అంజాగౌడ్, నింగప్ప, ప్రవీణ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ మండల పరిధిలోని మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ సమావేశానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.


మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్



సండే స్పెషల్

అద్దాల మేడలు అందమైన ఆవాసాలు

గృహ అలంకరణకు పెరుగుతున్న క్రేజ్

- రంగురంగు లైట్లు, ఉడెన్ కబోర్డులు
- ఆవరణలో ఫౌంటేన్‌లు, గార్డెన్‌లు
- ఇంటిని అందంగా తీర్చిదిద్దడానికి రూ.లక్షల్లో ఖర్చు
- స్టేటస్ కోసం పోటాపోటీ ఖర్చు
- పల్లెలకు విస్తరిస్తున్న అందమైన ఆవాసాలు



ఒకప్పుడు మహానగరంలో ధనికులు ఉండే ప్రాంతంలో కనిపించే అందమైన భవనాలు నేడు పల్లెలకు పాకాయి. రియల్ ఎస్టేట్ పుణ్యమంటూ గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. దానికి అనుగుణంగానే ప్రజల జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణ సమయంలో ఎక్కువగా ఇంటికి అందాన్ని తెచ్చే వాటిపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ఇంటీరియర్ డెకరేషన్ కోసం ఏకంగా లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. చిన్నపాటి ఇంటి నిర్మాణం నుంచి విలాసవంతమైన భవనం నిర్మాణాల్లో గృహ అలంకరణ ఒక భాగంగా మారింది.

– వాగుల దేవిడ్‌రాజ్, పటాన్‌చెరు

8లో

నైపుణ్యాలతో భవిష్యత్‌కు భరోసా


సర్టిఫికెట్లు అందుకున్న వారితో కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: యువత వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్‌కు భరోసా ఉంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు శనివారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అంశంలో బేసిక్స్ నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా లోన్లు మంజూరు చేస్తామని తెలిపారు. 2022 నుంచి ఇప్పటివరకు వివిధ కోర్సుల్లో 727 మంది యువతీ యువకులు శిక్షణ పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఇందులో ప్రజా సమస్యలపై దరఖాస్తుల స్వీకరణకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఈ–డిస్ట్రిక్ మేనేజర్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

రామాయంపేట(మెదక్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సూచించారు. రామాయంపేట జాతీయ రహదారిపై ప్రమాదాలకు ఆస్కారం ఉన్న అడిగాస్ హోటల్ వద్ద రోడ్డును శనివారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గానూ వాహనదారుల వేగానికి కళ్లెం వేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరైన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ ఈఈ సర్దార్‌సింగ్, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్‌ఐ రాజు పాల్గొన్నారు.

నవోదయ నోటిఫికేషన్ విడుదల

వర్గల్(గజ్వేల్): నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ, ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైందని సిద్దిపేట జిల్లా వర్గల్ జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని విద్యార్థులు సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2025 జనవరి 18న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలు కోసం www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

దుర్గమ్మ పల్లకీ సేవ



దుర్గమ్మ పల్లకీ సేవలో భక్తులు

పాపన్నపేట (మెదక్): వీడని వర్షంలోనూ వన దుర్గమ్మపై భక్తి చెక్కు చెదరలేదు. గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి ఏడుపాయల వన దుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వ హించారు. అర్చకులు, ఏడు పాయల చైర్మన్ బాలాగౌడ్, ధర్మ కర్తలు, భక్తులు మొదట దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి అర్చన చేసి గర్భ గుడి నుంచి గోకుల్ షెడ్డు వరకు, అమ్మ వారికీ పల్లకీ సేవ నిర్వహించారు.

గుడిసెలు కూలిపోయాయి.. ఆశ్రయం కల్పించండి

- అదనపు కలెక్టర్‌కు బాధితుల వినతి



కలెక్టరేట్ వద్ద బాధితులు

మెదక్ కలెక్టరేట్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మా గుడిసెలు కూలిపోయి రోడ్డున పడ్డామని, తమను ఆదుకోవాలంటూ పలువురు శనివారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. బాధితులు ఒల్లెపు తిరుతమ్మ, ఒల్లెపు మీనా తమ పిల్లలతో తరలివచ్చి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద తాతల కాలం నుంచి గుడిసెలు వేసుకొని రాళ్లు కొట్టుకుంటూ.. రోళ్లు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. గతంలో డబుల్‌బెడ్‌రూం కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదన్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తాము ఉంటున్న చిన్నపాటి గుడిసెలు కూడా కూలిపోయి రోడ్డున పడ్డామని, తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి : వంటేరు

గజ్వేల్: ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందని, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. శనివారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 39 లక్షల మంది రైతులుండగా, ప్రభుత్వం కేవలం 11 లక్షల మందికే రుణమాఫీని వర్తింపజేసి మాట తప్పిందని విమర్శించారు. ఇది నోచని రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని చెప్పారు. మరోవైపు 'రైతు భరోసా' నిధులు కూడా ఇంకా విడుదల చేయలేదన్నారు. వానాకాలం సాగు చేస్తున్న రైతులంతా ప్రభుత్వం నుంచి వచ్చే పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ నిధులు ఇవ్వకుండా రుణమాఫీ చేస్తున్నట్లు గొప్పగా ప్రకటించుకున్న ప్రభుత్వం ఆచరణలో దెబ్బతిందని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలోనే 'రైతు బంధు' సొమ్మును కచ్చితంగా జమ చేశామన్నారు. అదేవిధంగా 24 గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా, ప్రాజెక్టుల కాల్వల ద్వారా నీరందించి సాగు నీటి సమస్యలు లేకుండా చూశామని గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా కాళేశ్వరం ప్రాజెక్టులను నింపి భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగేందుకు బాటలు వేశామన్నారు.

సండే స్పెషల్

అద్దాల మేడలు అందమైన ఆవాసాలు



అమీన్‌పూర్‌లో ఓ విలాస భవంతి

గృహ అలంకరణకు పెరుగుతున్న క్రేజ్





పటాన్‌చెరు : నియోజకవర్గంలో అనేక గ్రామాల నుంచి రింగ్ రోడ్డు వెళ్లడంతో ఈ ప్రాంతానికి మరింత డిమాండ్ పెరిగింది. దీంతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు వచ్చాయి. ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు ఉండాలనుకుంటున్నారు. ఈ క్రమంలో అందమైన భవనాలు నిర్మిస్తున్నారు. ఇంటి నిర్మాణ సమయంలో ఎక్కువ ప్రాధాన్యత ఇంటి అందానికి ఇస్తున్నారు. లోపల ఉండే ఇంటీరియర్ డిజైన్‌కు ఎంత ఖర్చు అయినా పెట్టడానికి వెనుకాడడం లేదు. అందుకు తగ్గ డిజైన్ చేయడానికి అనేక మంది అందుబాటులో ఉన్నారు. వారికి ప్రత్యేక రుసుం చెల్లించి మరీ ఇంటీరియర్‌కు ప్లాన్ చేసుకుంటున్నారు. సుమారు రూ.10 లక్ష నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నారంటే ఏ స్థాయిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎవరు కొత్త ఇంటిని నిర్మించినా ఇంటీరియర్ డిజైన్‌పై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.



ఎకరా స్థలంలో ఇల్లు..

- పటాన్ చెరువు నియోజకవర్గ పరిధిలో ఓ జెడ్పీటీసీ సొంత గ్రామంలో అధునాతనమైన ఇంటీరియర్ డెకరేషన్‌తో ఇల్లు నిర్మించారు. దాదాపు మూడు వేల గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేట్టి ఇంటీరియర్ డిజైన్‌తో అందంగా తీర్చిదిద్దారు.
- ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఒకరు ఈ ప్రాంతంలో ఎకరా స్థలంలో చక్కటి నివాస గృహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఎకరా స్థలం రూ.15 కోట్ల వరకు పలుకుతుంది. ఇంటీరియర్ డెకరేషన్ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా అమీన్‌పూర్, తెల్లాపూర్‌లలో విశాలమైన విల్లా స్టైల్‌లో భవంతులు నిర్మించారు.
- అమీన్‌పూర్ పట్టణంలో ఒక ప్రజాప్రతినిధి దాదాపు రెండు వేల గజాల స్థలంలో ఇల్లు నిర్మించారు. ఖర్చుకు వెనుకాడకుండా చక్కటి ఇంటీరియర్ డిజైనింగ్‌తో అత్యంత విలాసమైన భవంతిని నిర్మించారు.
- చిట్కుల్ గ్రామంలో మరో ప్రజాప్రతినిధి అందమైన భవంతిని నిర్మించారు. అలాగే ఆయన తన గృహానికి సమీపంలో ఫామ్ హౌస్‌ను నిర్మించారు.కార్యకర్తల సమావేశాన్ని వీఐపీలతో మీటింగ్‌లను ఏర్పాటు చేస్తుంటారు.

నయా 'విల్లా'సం..

- జీ ప్లస్ టు స్థాయిలో విల్లాలను నిర్మిస్తున్నారు.
- గేటెడ్ కమ్యూనిటీలో 200 గజాల నుంచి 600 గజాల ప్లాటులో రియల్ ఎస్టేట్ సంస్థలు విల్లాస్ నిర్మించి విక్రయిస్తున్నాయి. ఒక్కో విల్లా రూ.2 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు అమ్ముడవుతోంది. అదే స్థాయిలో ఇంటీరియర్ డిజైన్ కోసం ఖర్చు చేస్తున్నారు.
- ఇంటి ఆవరణలో లేదా డాబాలపై స్విమ్మింగ్ పూల్‌లో ఫౌంటేన్‌లను పార్కులను నిర్మిస్తున్నారు.
- దాదాపు అందరూ జీ ప్లస్ టు ఇంటికైనా లిఫ్టులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అధునాతనమైన హోమ్ థియేటర్, విలాసవంతమైన కిచెన్ డిజైనింగ్ చేస్తున్నారు.
- రూ.600 పై నుంచి రూ.4,000 వరకు విలువ చేసే ఇటాలియన్ మార్బుల్ ఇంపోర్టెడ్ పాలరాతిని తెప్పించి ఫ్లోరింగ్ చేయిస్తున్నారు.
- ఇంటీరియర్ ఎక్స్‌టీరియర్ లైటింగ్ కోసం రూ.లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్నారు.
- బ్రిక్ అండ్ బోల్ట్ వంటి పెద్ద సంస్థలు ఇల్లు నిర్మాణానికి కాంట్రాక్టులు తీసుకుంటున్నాయి.

వేలాది మందికి ఉపాధి

ఇంటీరియర్ రంగంలో అనేక మంది ఉపాధి పొందుతున్నారు. ఇంటిని అందంగా తీర్చిదిద్దడానికి గోడలకు పైకప్పుకు ఎక్కువగా లప్పంతో పని చేస్తుంటారు. ఇంటీరియర్ పనులు చేసేందుకు ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ చెందిన వారే ఈ రంగంలో ఎక్కువగా రాణిస్తున్నారు. ఇంటి యజమాని అభిరుచికి అనుగుణంగా అందర్నీ ఆకర్షించేటట్లు ఉడెన్ వర్కులు, లప్పం వర్కును తీర్చిదిద్దుతున్నారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు గ్రూపులుగా వచ్చి ఈ పనులను చేస్తున్నారు. దీంతోపాటు ఇంటి అలంకరణకు ప్రజలు ఎక్కువ ఆసక్తిని కనపబర్చడంతో ఇంట్లో అమర్చే వస్తువులు విక్రయించేందుకు అనేక దుకాణాలు వెలుస్తున్నాయి. దీంతో ఈ రంగాన్ని నమ్ముకొని చాలా మంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

ఉడెన్ కబోర్డులు, రంగు రంగుల లైట్లు..

ఇల్లు నిర్మించేవారు వారి అభిరుచులకు అనుగుణంగా ఉడెన్ వర్క్, ఇంట్లో రంగు రంగుల లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. కబోర్డులు, తలుపులను సైతం ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నారు. ఇంట్లో పార్టీషన్ కోసం ప్రత్యేక డిజైన్ చేసిన గ్లాస్‌లను వాడుతున్నారు.



తెల్లాపూర్‌లోని ఓ ఇంట్లో

పోటాపోటీగా ఖర్చు



అమీన్‌పూర్ తెల్లాపూర్ ప్రాంతాల్లో కొందరు ఖర్చుకు వెనుకాడకుండా ఇంటీరియర్ డిజైనింగ్ కోసం డిజైనర్ల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదు. ఒకరిని చూసి ఒకరు పెద్ద ఎత్తున ఇంటీరియర్‌పై ఖర్చు చేస్తున్నారు.

– సురేశ్, సివిల్ కాంట్రాక్టర్

ఇల్లు అందంగా ఉండాలనే..



చక్కని సొంత ఇల్లు అనేది అందరి కల. ఇంటిని కళాత్మకంగా తీర్చిదిద్దడంలో నవీన పోకడలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. సొంతిల్లు నిర్మాణానికి పెట్టే ఖర్చు అంశం పక్కన పెడితే మన ం నివసించే ఇల్లు అందంగా ఉండాలనే ఒక కల ఎప్పటి నుంచో ఉండేది. ఓ మంచి గృహాన్ని నిర్మించుకున్నాం.

– నందారం నర్సింహా గౌడ్, వైస్ చైర్మన్, అమీన్ పూర్ మున్సిపాలిటీ

అలంకరణతో మరింత అందం



ఇంటి నిర్మాణంలో ఇంటీరియర్ వర్క్ ఒక భాగంగా మారింది. ఇంటిని మన అభిరుచికి తగ్గటుగా తీర్చిదిద్దుకోవడానికి ఇంటీరియర్ వర్క్ ఎంతో ఉపయోగపడుతుంది. మా ఇంటి ఇంటీరియర్ కోసం రూ.40 లక్షలు ఖర్చు చేశాం. నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారు ఇంటీరియర్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– లత, ఫ్యాషన్ డిజైనర్

సింగూర్ డ్యామ్ సందర్శనకు వెళ్తూ..

- కారు బోల్తా, ఇద్దరు యువకులు మృతి
- సదాశివపేట మండలంలో ఘటన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): స్నేహితులతో కలిసి సింగూర్ డ్యామ్ సందర్శనకు వెళ్తూ ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు ఫైజాన్ (19), ఖాసీం (20), సైజన్(20), సిద్దిఖీ(19), జోహెద్ (21), జాకీర్(20) ఆరుగురు స్నేహితులు కారులో సరదాగా సింగూర్ డ్యామ్ సందర్శనకు బయలుదేరారు. కారును ఫైజాన్ నడుపుతున్నాడు. మార్గమధ్యలో సదాశివపేట మండలం ఆత్మకూరు శివారులోని లక్ష్మీకాంత కాటన్ మిల్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కాల్వలోకి జారీ పల్టీలు కొడుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది.



ప్రమాదంలో బోల్తా పడిన కారు

ఈ ప్రమాదంలో కారులో సిద్దిఖీ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా వారికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జాకీర్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్షరాభ్యాసానికి వెళ్తూ అనంతలోకాలకు..

- డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా
- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు




కారును పరిశీలిస్తున్న ఎస్‌ఐ

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ కథనం మేరకు.. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం బార్డర్‌కు చెందిన అజారావు కుటుంబం, భాస్కరరావు కుటుంబం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని మూసాపేట్‌లో ఉండి జీవనం సాగిస్తున్నారు. వారి మనవళ్లకు బాసరలో అక్షరాభ్యాసం చేయించడానికి కారులో శనివారం వేకువజామున బయలుదేరారు. జాతీయ రహదారి–44 మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోకి రాగానే డ్రైవర్ మణికుమార్ అజాగ్రత్తగా నడపడంతో కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొని పక్కన గుంతలోకి పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహిళ అజారావు(55) అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన భాస్కర్ రావు (57) హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడు శిబుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.



అజారావు మృతదేహం

కారు, బైక్ ఢీ : ఒకరు మృతి



ప్రమాద స్థలంలో రెడ్డి సుభాష్

కొడిపల్లి(నర్సాపూర్): కారు, బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండల కేంద్రమైన కొడిపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఏఎస్‌ఐ విఠల్ కథనం మేరకు.. మండలంలోని ధర్మాసాగర్ గ్రామానికి చెందిన రెడ్డి సుభాష్(32) బైక్‌పై సొంత పని నిమిత్తం కొడిపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కాగా కొడిపల్లి శివారు చెరువు కట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా బీహెచ్‌ఈఎల్ లింగంపల్లికి చెందిన వ్యక్తి కారులో మెదక్ వైపు వస్తున్నాడు. కారు డ్రైవర్ ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రెడ్డి సుభాష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని వెంటనే అతడి తమ్ముడు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో..

శివ్వంపేట(నర్సాపూర్) : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చింతకాయల చంద్రమౌళి(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. బోరు బావి వద్ద పిచ్చి మొక్కలు తొలగిస్తున్న క్రమంలో తేలిన విద్యుత్ వైరు తగిలి కరెంట్ షాక్ కొట్టింది. అక్కడే కుప్పకూలిపోగా గుర్తించిన కుటుంబ సభ్యుల అరుపులతో చుట్టుపక్కల రైతులు వచ్చి ఫీజు వైర్లు తొలగించి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య పాపమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

- భర్త ఆత్మహత్య



అశోక్ గౌడ్ మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామానికి చెందిన నర్సాపురం అశోక్ గౌడ్(40)కి 16 ఏళ్ల కిందట వెల్దుర్తి మండలం అందులపల్లి గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. ఆరేళ్ల నుంచి కుటుంబ కలహాలు ఏర్పడి భార్య స్వప్న కొడుకు, కూతురిని తీసుకొని తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. అశోక్ గౌడ్ తల్లి దేవమ్మ వద్ద ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనోవేదనకు గురై గ్రామ శివారులోని పత్తికుంటలో నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారంలో నష్టం వచ్చిందని..

తూప్రాన్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి-2 కథనం మేరకు.. గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గాండ్ల ఆంజనేయులు(30) తూప్రాన్‌లో రెండేళ్ల నుంచి హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం కొనసాగక సుమారు రూ.10 లక్షల వరకు నష్టాలు వచ్చి 2023లో దుకాణం మూసి వేసి ఇంటి వద్దనే పెట్టుకున్నాడు. అప్పులు తీర్చలేక నిత్యం మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలోనే శనివారం ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య మానిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చర్యలు తీసుకుంటాం

- బిర్యానీ సెంటర్‌లో ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన అధికారులు

తూప్రాన్: బిర్యానీ సెంటర్‌లో భోజనం చేసి పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై శనివారం మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహియోద్దీన్ బిర్యానీ సెంటర్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లగా నిర్వాహకులు తాళం వేసి ఉంచారు. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా అస్వస్థతకు గురైన వారి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చామన్నారు. త్వరలోనే పట్టణంలోని హోటళ్లు, బిర్యానీ సెంటర్లపై తనిఖీలు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

115 కిలోల గంజాయి స్వాధీనం

- రూ.42.50 లక్షల విలువ
- ఇద్దరిపై కేసు, రెండు కార్లు సీజ్



గంజాయి, నిందితులను పట్టుకున్న అధికారులు

మునిపల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ గాంధీ నాయక్ కథనం మేరకు.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రోహిబిషన్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేయగా 115 కిలోల ఎండు గంజాయి లభించింది. వెంటనే కారులో ఉన్న ఎక్‌నాథ్ ఖేఫర్, అజినాథ్‌లను అరెస్ట్ చేసి, రెండు కార్లు సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.42.50 లక్షలు ఉంటుందని సీఐ పేర్కొన్నారు. తనిఖీల్లో వీణారెడ్డి, సీహెచ్.చంద్రశేఖర్, ఎస్‌ఐ అనిల్ కుమార్, యాదయ్య, ఎండీ. అలీం, గోపాల్, అమృతమ్మ, రామరావు నాయక్, ఉమారాణి, కావ్యశ్రీ, వివేక్, ప్రహ్లాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్క పెంచుతున్న యువకుడు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో గౌరబోయిన భరత్ అనే యువకుడు ఇంటి ఆవరణలో గంజాయి మొక్క పెంచుతున్నాడనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు శనివారం దాడులు చేశారు. మొక్కను స్వాధీ నం చేసుకొని, నిందితుడు భరత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

ఘనంగా గీతం స్నాతకోత్సవం



మాట్లాడుతున్న రామ్ గోపాల్



పట్టా కార్యక్రమంలో విద్యార్థులు

పటాన్‌చెరు : రుద్రారంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 15వ పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విభిన్న విద్యా విభాగాలకు చెందిన 1,490 మందికి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్లోబల్ బ్యాంకింగ్ వ్యూహకర్త, బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ ముఖ్య కార్యనిర్వహణాధికారి రామ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కేవలం వృత్తి నిపుణులుగా కాకుండా పరిపూర్ణ వ్యక్తులుగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవడం మంచిదని హితవు పలికారు. కష్టపడి పని చేయడం, కొత్త అనుభవాలను స్వీకరించడం, వైఫల్యం నుంచి నేర్చుకోవడం, అర్థవంతమైన సంబంధాలను పెంపొందించుకోవాలని పట్టభద్రులకు సూచించారు. సభాధ్యక్షత వహించిన ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ వె.గౌతమరావు మాట్లాడుతూ.. సంపూర్ణ విద్య పట్ల గీతం అంకితభావాన్ని నొక్కిచెప్పారు. గీతం హైదరాబాద్ ప్రాంగణంలో 2023–24 విద్యా సంవత్సరంలో 1,490 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్ వంటి వివిధ విభాగాల్లో డిగ్రీలు పొందడానికి అర్హత సాధించగా, 1,325 మంది విద్యార్థులు వ్యక్తిగతంగా హాజరై పట్టాలను స్వీకరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 23 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డీ.గుణశేఖరన్, గీతం కార్యదర్శి ఎం. భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు పేరుతో మోసం..

- రూ.49 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్ : క్రెడిట్ కార్డ్ అప్‌డేట్ అంటూ ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్ చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి ఈనెల 3వ తేదీన అపరిచిత వ్యక్తులు బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని క్రెడిట్ కార్డు అప్ డేట్ చేయాలని చెప్పారు. బాధితుడు తన వివరాలను చెప్పడంతో పాటు ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాడు. వెంటనే బాధితుడి ఖాతాలో ఉన్న రూ. 45 వేలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో పటాన్‌చెరు శ్రీ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి బ్లూ డ్రాఫ్ట్ కొరియర్ నుంచి కాల్ చేస్తున్నామని ఈనెల 14వ తేదీన ఫోన్ కాల్ వచ్చింది. బాధితుడు అపరిచిత వ్యక్తి అడిగిన వాటికి వివరాలు చెప్పడంతో అతడి ఖాతాలో ఉన్న రూ.15 వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.